ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 9 ఆగస్టు 2024



ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 8: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 8 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో పీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 10వ తేదీ వరకు గడువు ఉందన్నారు. టెన్త్ అడ్మిషన్ ఫీజు ఓసీలకు 1550, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 1150 రూపాయలు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఇంటర్ ప్రవేశాలకు ఓసీలకు 1800, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 1500 రూపాయలు చెల్లించాలని తెలిపారు. వివరాలకు ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ చలువాజు నాగేశ్వర్‌రావును సంప్రదించాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్, ఆగస్టు 8: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో జరుగుతున్న విషయాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. కుక్కలు, కోతులతో ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులను వాడాలన్నారు. ఆగస్టు 15లోగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మూడు జతల సాక్స్‌లు, ఒక జత షూ అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు పెన్నులను అందజేశారు. పారిశుధ్య కార్మికులను శాలువాతో సన్మానించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ కనకయ్య, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వెటర్నరి డాక్టర్ రవికుమార్, రమ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

- హుజూరాబాద్ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్‌ను కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు వేణుగోపాల్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.

'ఈ శ్రమ్'లో నమోదు చేసుకున్న కార్మికులకు ఎక్స్‌గ్రేషియా

కరీంనగర్ టౌన్, ఆగస్టు 8: అసంఘటిత రంగాల్లో పనిచేస్తూ 2021 ఆగస్టు 26 నుంచి 2022 మార్చి 31లోపు ఈశ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న కార్మికులకు ఎక్స్‌గ్రేషియా వర్తిస్తుందని జిల్లా ఉప కార్మికశాఖ కమిషనర్ శామ్యూల్ జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోర్టల్‌లో నమోదు చేసుకున్న కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందినా, శాశ్వత అంగవైకల్యం పొందినా వారి కుటుంబాలకు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ ఎక్స్‌గ్రేషియా ఇస్తుందన్నారు. పోర్టల్‌లో నమోదు చేసుకుని మృతి చెందిన, శాశ్వత అంగవైకల్యం చెందిన కార్మికులు కుటుంబాలు ఎక్స్‌గ్రేషియా పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతోపాటు మరణ ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డు, ఈశ్రమ్ కార్డు, ఎఫ్ఐఆర్, పంచనామా, పోస్టుమార్టం రిపోర్టు, నామినీ బ్యాంకు అకౌంట్ వివరాలను జత చేయాలని తెలిపారు. దరఖాస్తులను ఉపకార్మిక కమిషనర్ కార్యాలయం, కరీంనగర్‌లో ఈనెల 27న సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని సూచించారు.

త్వరలో మల్టీపర్పస్ పార్కు ప్రారంభం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 8: మల్టీపర్పస్ పార్కును త్వరలో ప్రారంభిస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం ఆయన పార్కును సందర్శించి అభివృద్ధి, సుందరీకరణ పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్లు, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో 11 కోట్ల రూపాయలతో పార్కులో చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. ఇప్పటికే జ్యోతిబాపూలే పార్కును కూడా సుందరీకరించి అందుబాటులోకి తెచ్చామని, దానికంటే అద్భుతంగా ఈ పార్కును తీర్చిదిద్దాలన్నదే తమ ఆలోచన అని అన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎంపీ బండి సంజయ్‌కుమార్ పార్కుల అభివృద్ధికి సహకరిస్తున్నారని చెప్పారు. నగరంలో ఇప్పటికే 25 పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని, 14వ డివిజన్ రాజీవ్ పార్కులోనూపనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటివరకు 30 ఓపెన్ జిమ్స్‌లు ఏర్పాటు చేశామని, మరో 30 జిమ్ముల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమం లో కార్పొరేటర్ కచ్చు రవి, నాయకులు తులా బాలయ్య, ఎడ్ల అశోక్, ఈఈ యాదగిరి,ఆర్‌వీ కన్సల్‌టెంట్ ప్రతినిధిమురళీకృష్ణ, కుమార్ పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి

భగత్‌నగర్, ఆగస్టు 8: అర్హులైన పేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో చింతకుంటలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు అగ్గిపెట్టెల్లా ఉన్నాయని, తాము డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారన్నారు. చింతకుంటలో నిర్మించిన ఇళ్లు 90 శాతం పూర్తయ్యాయని, వాటిని వెంటనే పేదలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తిప్పారపు సురేష్, గజ్జల శ్రీకాంత్, పున్నం రవి, పుల్లెల మల్లయ్య, జి తిరుపతి, గాజుల కనకరాజు, శ్రీకరాంత్, రత్నం సురేష్, కొయ్యడ అనిల్, సన్ని రాముడు, పాల్గొన్నారు.

- చాలా సమయమున్నా ఏర్పాట్లు చేసుకుంటున్న ఆశావహులు
- పట్టభద్రుల స్థానానికి పోటాపోటీ
- కాంగ్రెస్ నుంచి రాజేందర్‌రావు, ఆర్ సత్యనారాయణ పేర్లపైచర్చ
- బీఆర్‌ఎస్‌లో బీఎన్‌రావు, రవీందర్‌సింగ్, శేఖర్‌రావు
- టీచర్ల ఎమ్మెల్సీపై కూడా రాజకీయ పార్టీల దృష్టి

ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆసక్తి



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మార్చితో పూర్తికానున్న ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు నవంబరు 1ని కటాఫ్ తేదీగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు ఓటర్ల జాబితాను రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మళ్లీ రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం రూపుదిద్దుకుంటు న్నది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల స్థానంలో ఎమ్మెల్సీగా ఉన్న టి జీవన్‌రెడ్డి కాంగ్రెస్, టీచర్స్ ఎమ్మెల్సీగా ఉన్న రఘోత్తమ్‌రెడ్డి, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీగా ఉన్న నర్సిరెడ్డి పదవీకాలం మార్చి 29తో ముగియనున్నది. ఆలోగానే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండడంతో కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించి ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలుజారీ చేసింది.

రాజకీయ ప్రాధాన్యం

టీచర్ల ఎమ్మెల్సీ పోటీ చేసేందుకు ఉపాధ్యాయులకే అవకాశముండడంతో ఆ వర్గాల్లోనే ఆసక్తి నెలకొని ఉన్నా పట్టభద్రుల స్థానం విషయం వచ్చే వరకు రాజకీయాల ప్రమేయం ఎక్కువగా ఉంటుంది. పార్టీ అభ్యర్థులే పోటీలో దిగుతుండడంతో అన్ని పార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తాయి. నాలుగు జిల్లాల పరిధికి చెందిన విద్యావంతులు, ఉపాధ్యాయులు ఈ ఎమ్మెల్సీలను ఎన్నుకోవలసి ఉన్న నేపథ్యంలో రాజకీయ అవగాహనతోనే ఓట్లు వేసే అవకాశాలుంటాయి. దీంతో రాజకీయ పక్షాలు మేధావి వర్గాల అభిప్రాయం తమపై ఎలా ఉందో తెలుసుకోవడానికి ఈ ఎన్నికలను ప్రామాణికంగా భావిస్తారు. అందుకే ఈ ఎన్నికలకు రాజకీయ ప్రాధాన్యం పెరిగి చర్చనీ యాంశంగా మారాయి.

బలమైన అభ్యర్థి కోసం బీజేపీ యత్నం

బీజేపీ కూడా పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎంపీ స్థానాలను గెలుచుకున్న ఆ పార్టీ వాటి పరిధిలోనే వస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీని కూడా సాధిస్తామన్న విశ్వాసంతో ఆ పార్టీ ఉన్నది. బలమైన అభ్యర్థిని రంగంలో దింపాలని నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైతే తెరపైకి ఎవరి పేర్లు రావడం లేదు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి కూడా మంచి పోటీనే ఉండే అవకాశమున్నది. అభ్యర్థుల విషయంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇప్పుడిప్పుడే సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఆలోచన చేస్తున్నాయి. ఈనెలాఖరులోగా అభ్యర్థుల విషయంలో స్పష్టత వచ్చే అవకాశమున్నది.

జీవన్‌రెడ్డి మళ్లీ పోటీ చేస్తారా..?

కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న టి జీవన్‌రెడ్డి మళ్లీ పోటీ చేస్తారా లేదా అన్ని విషయంలో ఇప్పటికైతే ఎలాంటి స్పష్టత రాలేదు. జగిత్యాల అసెంబ్లీ స్థానంలో ఆయనపై గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. జీవన్‌రెడ్డికి మళ్ళీ అక్కడ అసెంబ్లీ టికెట్ ఇస్తారా సిట్టింగ్‌కే ప్రాధాన్యం ఉంటుందా అనే ప్రశ్న తలెత్తుతున్నది. ఈకారణంతోనే జీవన్‌రెడ్డి ఆయన రాకను వ్యతిరేకించగా అధిష్టానం నచ్చజెప్పడంతో శాంతించారు. ఆయనకు ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం లేని పక్షంలో ఎమ్మెల్సీగా మళ్లీ పోటీ చేస్తారా అన్న చర్చ కూడా కాంగ్రెస్‌లో ఉంది. జీవన్‌రెడ్డి వయసు ఎక్కువైనందు వల్ల ఆయన ఈసారి పోటీలో ఉండక పోవచ్చనే చర్చ జరుగుతున్నది.

- కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసి ఓడిపోయిన వెలిచాల రాజేందర్‌రావు ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పోటీ చేయడంపై ఆసక్తి చూపిస్తున్నారు. ఆయన ఇప్పటికే ఆయా జిల్లాల పరిధిలోని మంత్రులను, ఎమ్మెల్యేలను కలిసి పోటీ విషయాన్ని చెప్పి మద్దతు కోరుతున్నట్లు సమాచారం. ఆయన డీసీసీ అధ్యక్ష స్థానాన్ని కోరుకుంటున్నారని, రెండు అవకాశాలు ఇస్తారా లేదా ఏదో ఒకదానితో సరిపెడతారా అన్నదానిపై స్పష్టత రావడం లేదు.
- బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్సీ టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు ఆర్ సత్యనారాయణ పట్టభద్రుల స్థానంలో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణ ఉద్యమకారుడిగా, జర్నలిస్టుగా ఆయనకు రాజకీయవర్గాల్లో, ప్రజాసంఘాల్లో విస్తృత సంబంధాలు, గుర్తింపు ఉన్నాయి. బీఆర్‌ఎస్ పార్టీలో ఎమ్మెల్సీగా గెలిచిన ఆయనను ఉద్యమ రాజకీయాల్లో భాగంగా రాజీనామా చేయించి మళ్లీ పోటీచేసే అవకాశం ఇవ్వకుండా బీఆర్‌ఎస్ నాయకత్వం అన్యాయం చేసిందనే అభిప్రాయం విద్యావంతుల్లో, రాజకీయపక్షాల్లో ఉన్నది. ఇప్పుడు ఆయన కూడా టికెట్ ఆశిస్తుండడంతో బలమైన పోటీదారుగా నిలుస్తున్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురు

బీఆర్‌ఎస్ పార్టీలో కరీంనగర్‌కు చెందిన వైద్యుడు, ఐఎంఏ నాయకుడు డాక్టర్ బీఎన్ రావు, మాజీ మేయర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. బీఎన్ రావు ఇప్పటికే బీఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు, మాజీ మంత్రి హరీష్‌రావును కలిసి తన ఆసక్తి గురించి వివరించి అవకాశం కల్పించాలని కోరారు. పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో ఉన్న నాలుగు జిల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తున్న ఆయన విద్యావంతులు, మేధావులు, డాక్టర్లు, రాజకీయ ప్రముఖులను కలుస్తున్నారు. వివిధ అంశాలపై ఆయా ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తూ తాను పోటీచేసే విషయాన్ని వివరిస్తూ మద్దతు కూడగట్టుకుంటున్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా వైద్య సహాయాన్ని విద్యార్థులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తూ వస్తున్నారు. బీఆర్‌ఎస్ అవకాశం కల్పించని పక్షంలో ఇండిపెండెంట్ గానైనా బరిలో ఉండేందుకే ఆయన సంసిద్ధులై ముందుకు సాగుతున్నారని, మెజార్టీ ఓట్లు ఉన్న కరీంనగర్ జిల్లాలో పలువురు ఆయనకు ఇప్పటికే మద్దతు ప్రకటించారని చెబుతున్నారు.

- తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పార్టీ అధినేత కేసీఆర్‌తో వెన్నంటి నిలుస్తూ వస్తున్న సర్దార్ రవీందర్‌సింగ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్‌ను ఆశిస్తున్నారు. కేసీఆర్‌పైనే ఆయన పూర్తి నమ్మకం పెట్టుకొని ఉన్నారు. తెలంగాణ ఉద్యమకారుడిగా, న్యాయవాదిగా, రాజకీయనాయకుడిగా ఆయనకు విస్తృత సంబంధాలు ఉన్నాయి.
- బీఆర్‌ఎస్ నుంచి ట్రస్మా నాయకుడు యాదగిరి శేఖర్‌రావు కూడా ఎన్నికల బరిలో ఉండనున్నారు. గతంలోనూ ఆయన పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేయాలని భావించి నాలుగు జిల్లాల్లో ఓటర్ల నమోదు తదితర కార్యక్రమాలు చేపట్టినా పార్టీ ఆదేశంతో పోటీ నుంచి తప్పుకొని ఇతరులకు మద్దతు పలకాల్సి వచ్చింది. ఈసారైనా తనకు అవకాశం కల్పించక పోతారా అన్న ఆశాభావంతో ఆయన ఉన్నారు. ఉపాధ్యాయుడిగా విద్యా సంస్థల యజమానుల నాయకుడిగా ఆయనకు ఉన్న సంబంధాలు పోటీలో నిలిచేందుకు తోడ్పడుతున్నాయి.

దళితులను విస్మరించిన కేంద్ర బడ్జెట్

- జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలి
- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్



నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

గణేశ్‌నగర్, ఆగస్టు 8: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం బడ్జెట్‌లో దళితులను పూర్తిగా విస్మరించిందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో ప్లకార్డులతో గురువారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ దళిత సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం తగిన బడ్జెట్‌ను కేటాయించడం లేదని విమర్శించారు. జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దళిత హక్కుల కోసం వాదించే సంస్థలు దేశవ్యాప్తంగా నిరసనలు నిర్వహిస్తున్నాయన్నారు. బడ్జెట్ కేటాయింపులు, వ్యయాలను పెంచాలని, షెడ్యూల్డ్ కులాల సబ్ ప్లాన్‌ను జాతీయ స్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రైవేటు రంగంలో దళితులకు రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లలో రిజర్వేషన్ల రాజ్యాంగ ప్రకారం అమలు చేయాలన్నారు. దళితులపై అఘాయిత్యాలు జరగకుండా నిరోధించడానికి ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మణ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వడ్ల రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్, సుంకరి సంపత్, కేవీపీఎస్ నగర కార్యదర్శి గాజుల కనకరాజు, నాయకులు కండే రాజు, కోలాపురి ప్రభాకర్, సుకోసి శ్రీకాంత్, మొగురం రమేష్ పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 8: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ను ఎగురవేసి దేశ ఐక్యతను చాటాలని భారతీయ జన తా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో హర్‌ఘర్ తిరంగా అభియాన్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు తలపెట్టిన హర్‌ఘర్ తిరంగా అభియాన్‌ను విజయ వంతం చేయాలన్నారు. 11 నుంచి 14 వరకు తిరంగా యాత్ర చేపట్టాలన్నారు. 13 నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో నిర్వహించాలన్నారు. 12 నుంచి 14 వరకు మహనీయుల విగ్రహాలు, స్మారక చిహ్నాల చుట్టూ పరిశుభ్రం చేయాలన్నారు. 14న విభజన గాయాల స్మారక దినం జరపాలని, అందులో భాగంగా సమ్మేళనాలు, సదస్సులు నిర్వహించాలన్నారు. 13 నుంచి 15 వరకు అమరవీరుల స్మారక చిహ్నాలు, విగ్రహాల వద్ద పుష్పాంజలి ఘటించాలన్నారు. 11 నుంచి 15 వరకు జరిగే వివిధ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులతోపాటు అన్నివర్గాల ప్రజలు భాగస్వా ములయ్యే విధంగా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల మీద జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో బాస సత్యనారాయణరావు, గుగ్గిళ్లపు రమేష్, బంగారి రాజేంద్రప్రసాద్, నాగేశ్వర్ రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బోయినపల్లి ప్రవీణ్ రావు, కన్న కృష్ణ, కొలగాని శ్రీనివాస్, గాయత్రి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ వైపే మొగ్గు

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల సంఖ్య

శంకరపట్నం, ఆగస్టు 8: శంకరపట్నం మండలంలో మోడల్ స్కూల్‌ల దెబ్బతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. మండలంలో విద్యా సంవత్సరం ప్రారంభంలో ఆదర్శ పాఠశాలలకు అప్లై చేసుకొని ప్రవేశ పరీక్ష రాసి సీటు సాధించిన వారు ఆదర్శ పాఠశాలకు వెళ్లారు. సైదాపూర్ మండలం సోమారం మోడల్ స్కూల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో శంకరపట్నం మండలంలోని గ్రామాల్లో విద్యార్థుల కోసం హుజూరాబాద్ డిపో నుంచి బస్సు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల నుంచి కొంత మంది విద్యార్థులు సోమారం మోడల్ స్కూల్‌కి వెళుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో ఉన్నప్పటికి తల్లిదండ్రులు విద్యార్థులను పంపించ డానికి ముందుకు రావడం లేదు. ఆర్థికంగా ఉన్న వారు పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపుతున్నారు. మధ్యతరగతి, ఆర్థికంగా వెనుకబడిన తల్లిదండ్రులు తమ పిల్లలను మండల కేంద్రంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలతోపాటు మోడల్ స్కూల్ కస్తూర్బా పాఠశాలకు కన్నాపూర్ పాఠశాలలో 50కిపైగా విద్యార్థులు ఉండగా, ఎరడపల్లి, కొత్తగట్టు, మెట్‌పల్లి, మొలంగూర్, గద్దపాకలో 50లోపే విద్యార్థులు ఉన్నారు. కేశవపట్నం మోడల్ స్కూల్లో 497 మంది హైస్కూల్ విద్యార్థులు ఉన్నారు.



గద్దపాకలో అపరిశుభ్రంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల ఆవరణ

పంపుతున్నారు. బయటకు వెళ్లడానికి అవకాశం లేని వారు మాత్రమే దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉన్నప్పటికిని విద్యార్థుల సంఖ్య అందుకు అనుగుణంగా అండడం లేదు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు

మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాల్లో మౌళిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు రావడం లేదు. గద్దపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. విద్యార్థులకు మూత్రశాలలు లేవు. చిన్న వర్షానికి పాఠశాల ఆవరణలో నీరు నిలుస్తున్నాయి. దీంతో ఆ పాఠశాలకు విద్యార్థులను పంపించడానికి తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. మండలంలో ఎనిమిది హైస్కూళ్లు ఉన్నాయి. కేశవపట్నం, తాడికల్, పాఠశాలల్లో మాత్రమే ఆరు నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు వందకు పైగా ఉన్నారు.



సోమారం మోడల్ స్కూల్‌కి బస్సులో వెళ్తున్న విద్యార్థులు

'మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం చేసుకోవద్దు'

చిగురుమామిడి,అగస్టు 8: బంగారు భవిష్యత్ ఉన్న విద్యార్థులు మాదక ద్రవ్యాలు వాడి జీవితాలను నాశనం చేసుకోవద్దని తిమ్మాపూర్ సిఐ అన్నారు. గురువారం మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామంలో గల మోడల్ స్కూల్‌లో సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్‌క్రైమ్‌కు గురైతే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలపై అయితే 100 నెంబర్ కాల్ చేయాలన్నారు. ఉన్నతమైన చదువులు చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఎస్సై బండి రాజశే, పాఠశాల ప్రిన్సిపాల్ ఉన్నారు.

యువతి ఆత్మహత్య

తిమ్మాపూర్, ఆగస్టు8: మండలంలోని పోరండ్ల గ్రామంలో ఓ యువతి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోరండ్ల గ్రామానికి చెందిన మామిడి మొగిళి గ్రామంలో హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు మామిడి అఖిల(20) యంఎల్‌టి చదివింది. గురువారం మధ్యాహ్నం అఖిల హోటల్ వద్దకు వచ్చి మధ్యాహ్నం 2గంటల వరకు తల్లితో మాట్లాడి ఇంటికి వెళ్లింది. తరువాత కొద్ది సేపటికి సుమారు 3.30గంటల సమయంలో తల్లి కుతురు అఖిలకు ఫోన్ చేయగా ఫోన్ ఎత్తకపోవడంతో తల్లి ఇంటికి వెళ్లింది. ఇంటికి వెళ్లి చూసే సరిగి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని కనిపించింది. స్థానికులు వచ్చి అఖిలను కిందికి దింపి చూడగా అప్పటికే అఖిల మృతి చెందింది. అయితే తన కూతురు చనిపోయేముందు ఒక పుస్తకంలో అంగోతు భరత్, అంగోతు కోటయ్య, అంగోతు విజయలు ఫోన్‌లో వేధింపులకు గురిచేశారని, ఆర్థికంగా కూడా ఇబ్బందులకు గురి చేసినందుకుగాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు, తన చావుకు వారే కారణం అని రాసిందని తెలిపారు. తన కూతురు చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తండ్రి మొగిళి పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు వారు తెలిపారు.

ఇంటింటా జ్వర సర్వే

చొప్పదండి, ఆగస్టు 8: స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చొప్పదండిలో వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో డెంగ్యూ, మలేరియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మేనేజర్ ప్రశాంత్ కుమార్, కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.

యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్
మరో ఆరు నెలలు పొడిగింపు

జమ్మికుంట, ఆగస్టు 8: జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో యశ్వంత్‌పూర్-గోరఖ్‌పూర్, గోరఖ్‌పూర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ గడువును మరో ఆరు నెలల పాటు పొడిగిస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ శ్రీధర్ గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. జమ్మికుంటలో జనవరి 29న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ మొదలైన విషయం తెలిసిందే. ప్రయోగాత్మకంగా ప్రారంభించిన హాల్టింగ్‌కు అనుకున్న విధంగా ప్రయాణికుల నుంచి స్పందన రాలేదు. దీంతో ఈ నెల 10వ తేదీ నుంచి హాల్టింగ్‌ను మరో ఆరు నెలల పాటు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

వారణాసిలో
వేములవాడ సత్రం ప్రారంభం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 8: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వారణాసి (కాశీ) క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య వాసవి నిత్యాన్న సత్ర సంఘం వేములవాడ ఆధ్వర్యంలో వేములవాడ సత్రం ఏర్పాటు చేసింది. గురువారం వారణాసిలోని ఓ అద్దె భవనంలో సత్రం కమిటీ అధ్యక్షుడు, కరీంనగర్‌కు చెందిన వ్యాపారవేత్త బుస్సా శ్రీనివాస్ దంపతులచే పూజలు చేసి వేములవాడ సత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ సత్రం ఉపాధ్యక్షుడు ఉప్పల రామేశం, బుస్సా దశరథంతో పాటు పలువురు దాతలు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుస్సా శ్రీనివాస్ మాట్లాడుతూ 18 డీలక్స్ రూమ్‌లతో ఉన్న అద్దె భవనంలో తాత్కాలికంగా వేములవాడ సత్రంను ప్రారంభించామని, శాశ్వత భవన నిర్మాణం కోసం ఇప్పటికే దాతలు ఇచ్చిన విరాళాలతో స్థలం కొనుగోలు చేశామని, శుక్రవారం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తామని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి వారణాసి క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం చక్కటి వసతితోపాటు తెలంగాణ రుచులతో కూడిన భోజనం కూడా కల్పించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బుస్సా శ్రీనివాస్ కోరారు.

ఇసుక డంప్ సీజ్

సుల్తానాబాద్, ఆగస్టు 8: మండలంలోని గర్రెపల్లి సమీపంలోగల ఓ వ్యవసాయ భూమిలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి గురువారం తెలిపారు. డంప్ వద్ద ఉన్న దాదాపు ఇరవై ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అక్రమంగా ఇసుక తరలింపు కానీ, డంప్‌లు కానీ ఏర్పాటు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బీఎస్సీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 8: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూన్ 2024లో నిర్వహించిన బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్ రెండో సెమిస్టర్) పరీక్షల ఫలితాలను యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్ గురువారం విడుదల చేశారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 8: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 8,816 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల నుంచి మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 121 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.935 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 17.15 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.24టీఎంసీల నీరు ఉంది. మిడ్ మానేరు ద్వారా 6,400 క్యూసెక్కుల నీటిని రెండు మోటార్ల ద్వారా ఎత్తిపోస్తుండగా రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

● ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు అధికారులు మూడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం ఎస్సారెస్పీలోకి 6,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువకు మూడు వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు వంద క్యూసెక్కులు, లక్ష్మి కాలువకు 50 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.


ఎస్సారెస్పీ ప్రాజెక్టు

దోస్త్ స్పెషల్ ఫేజ్ సీట్ల కేటాయింపు పూర్తి

గణేశ్‌నగర్, ఆగస్టు 8: శాతవాహన విశ్వవిద్యాలయంలో దోస్త్ స్పెషల్ ఫేజ్ సీట్లలో ఉన్నత విద్యా మండలి శాతవాహన యూనివర్సిటీ పరిధిలో మొత్తం 3,157 సీట్లను కేటాయించిందని శాతవాహన యూనివర్సిటీ దోస్త్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత తెలిపారు. మొత్తం మూడు ఫేజ్‌లకు 15,950 సీట్లు కేటాయించగా 11,848 మంది విద్యార్థులు కళాశాలలో రిపోర్ట్ చేశారన్నారు. స్పెషల్ ఫేజ్‌లో 3157 సీట్లలో ప్రభుత్వ కళాశాలలో 440మంది విద్యార్థుల సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. రెండు ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో 451మంది విద్యా ర్థులకు, ప్రైవేటు కళాశాలల్లో 2266 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. స్పెషల్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు శుక్రవారం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి సీటు రిజర్వ్ చేసుకోవాలని లేనిపక్షంలో సీటు రద్దు అవుతుందని తెలిపారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఆగస్టు 8: జగిత్యాల పట్టణంలోని సాయిరాంనగర్‌కు చెందిన రామస్వామి (54) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు టౌన్ ఎస్సై మన్సూర్‌ఖాన్ తెలిపారు. రామస్వామి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్థాపానికి గురై తన ఇంట్లో తాను నిద్రిస్తున్న మంచానికి నిప్పు అంటించుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మన్సూర్‌ఖాన్ తెలిపారు.

గౌరవెల్లి రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

చిగురుమామిడి, ఆగస్టు 8: గౌరవెల్లి రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని, హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించాలని గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అధ్వర్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఢిల్లీలో కలిసి విన్నవించారు. నేషనల్ హైవే రోడ్డు పనుల్లో కొంత మార్పులు చేయలని కోరినట్లు తెలిపారు. డివైడర్‌తో పాటు 4 వరుసల రోడ్డు వేయాలన్నారు. అంతకపేట నుండి కొత్తకొం డ వరకు నిర్మాణం చేయనున్న రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని అందుకు సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఎగువ ప్రాంతమైన కన్నారం, గండిపల్లి, కట్కూర్, కన్నా రం, ప్రాంతలకు సాగునీరు అందించెందుకు ఎర్పాట్లు జరిగెలా కృసి చేయలని కోరినట్లు తెలిపారు. తాము విన్నవించిన అనేక సమస్యలపై మంత్రి సానూ కులంగా స్పందించినారని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. మరిన్ని నిధులు మంజూరు చేసి అన్ని గ్రామాల్లో పూర్తిగా అబివృద్ధి పనులు జరిగేలా మంత్రి ప్రత్యేక కృషి చేస్తారని తెలిపారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి, కుట్కూర్ గ్రామ మాజీ సర్పంచ్ జిల్లె అశోక్‌రెడ్డి, చందుపట్ల నాగరాజు, లతో పాటు తదితరులు ఉన్నారు.


కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో సమావేశమైన నాయకులు

భోజన్నపేటలో కుక్కల దాడి

● నలుగురికి గాయాలు
● నివారణ చర్యలు చేపట్టని అధికారులు

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 8 : పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో కుక్కల దాడి అధికమవుతోంది. మండలంలోని భోజన్నపేటలో గురువారం నలుగురు వ్యక్తులతో పాటు లేగదూడపై పిచ్చికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రులకు తరలించారు. ప్రతి రోజు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, మహిళలు దాడి చేసిన వైనాన్ని చూసి ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అయినప్పటికీ గ్రామాల్లో కుక్కల బెడదను నివారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఎల్లారెడ్డిపేటలో ఆరుగురు విద్యార్థులకు...

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 8: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం కుక్కలు దాడి చేసిన సంఘటనలో ఆరుగురు విద్యార్థులు తీవ్ర గాయాలపాలయ్యారు. గ్రామానికి చెందిన విద్యార్థులు మస్కూరి బ్రిటిష, మస్కూరి సహస్ర, ఏర్పుల వరుణ్, మద్దుల వర్షిత్ రెడ్డి, రాగుల రిత్విక, గుండం హనీష్ పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఆరుబయట హోంవర్క్ చేస్తున్న విద్యార్థులపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. తీవ్ర గాయాల పాలైన విద్యార్థులను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పలుమార్లు దాడి చేసి గాయపరిచినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కుక్కల బారి నుంచి తమకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

11న ఉమ్మడి జిల్లా
మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 8: ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 11న ఉమ్మడి జిల్లా మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డబ్ల్యూ గణపతి తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ చాటే మహిళా క్రీడాకారులను ఈనెల 16 నుంచి నిజామాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. 2008కి ముందు జన్మించిన క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్‌తో జనన ధ్రువీకరణ పత్రంతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో జిల్లా ఉపాధ్యక్షుడు అంతటి శంకరయ్యకు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్:9849114956 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక,ఆగస్టు8:మండలంలోని రెడ్డిపల్లిలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా కొర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నా టాక్టర్‌ను పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అంబాల రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో స్నేహితుడి హత్య

● డీఎస్పీ రఘుచందర్

కొడిమ్యాల, ఆగస్టు 8 : మద్యం మత్తులో స్నేహితుడినే హత్య చేసిన సంఘటనలో ఇద్దరు నిదితులను అరెస్ట్ చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వెల్లడించారు. గురువారం కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు తెలిపారు. ఈ మేరకు పూడూర్ గ్రామానికి చెందిన మామిడి కమల్, మల్యాల మండలం గొర్రెగుండం గ్రామానికి చెందిన చిలువేరి తిరుపతి మృతుడు కందుల రాజశేఖర్‌తో మద్యం సేవించారు. మద్యం తాగుతున్న సమయంలో పాత గొడవల ప్రస్తావన వచ్చిందన్నారు. అదే సమయంలో రాజశేఖర్‌తో కమల్, తిరుపతి గొడవపడుతు కర్రతో తలపై కొట్టారన్నారు. రాజశేఖర్ అరుస్తుండగా నోటిలో ఇసుక పోసినట్లు డీఎస్పీ వివరించారు. హత్య చేసి సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు గాను మృతుడి స్కూటీ నుంచి పెట్రోలు తీసి కాల్చారన్నారు. నిందితులు ఇద్దరు కరీంనగర్ పారిపోతుండగా పూడూర్ గ్రామ శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరు నిందితుల వద్ద నుండి రక్తం మరకలు ఉన్న బట్టలు, సెల్, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల్లో హత్య కేసు చేదించిన మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్, పోలీసులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

రుణమాఫీకి కాంగ్రెస్ కొర్రీలు

● కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 8 : ఎన్నికల ముందు షరతులు లేకుండా రెండు లక్షలలోపు మూడు దఫాల్లో రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత అమలుకు సవాలక్ష ఆంక్షలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమాన్ని పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి నేతృత్వంలో గురువారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో నిర్వహించగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ, కోడిపల్లి గోపాల్‌రెడ్డిలతో కలిసి ఆయన హాజరయ్యారు. రుణమాఫీ గురించి గ్రామాల్లోని రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 65లక్షల పాస్ బుక్‌లు ఉంటే ఎంత మందికి రుణమాఫీ చేస్తున్నారో తెలిపాలని, అదే విధంగా రైతు భరోసా రూ.15వేలు సంవత్సరంలోపు ఇస్తామన్న హామీ నేరవేర్చకుండా రైతు పసల్ బీమా యోజన, ధాన్యానికి క్వింటాలకు రూ. 500ల బోనస్ ఇవ్వడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు పార్టీ కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు మారు జనార్ధన్‌రెడ్డి, భోగ గంగాధర్, బోడ్ల రమేష్, వడ్డేపల్లి శ్రీనివాస్, సుఖేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సిబ్బంది తక్షణమే స్పందించాలి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 8: విద్యుత్ సమస్యలు ఉంటే సిబ్బంది తక్షణమే స్పందించాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ గంగాధర్ అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ డీఈలు, ఏడీలు, ఏఈలు, ఏఏఓలు, సబ్ ఇంజనీర్లు ఇతర విద్యుత్ అధికారులతో ఎస్‌ఈ గంగాధర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ఉన్న ప్రతిచోట సిబ్బంది తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. సిబ్బంది పనిచేస్తున్నపుడు అన్ని రక్షణ పరికరాలు వాడి, విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రోజు ఉదయం సెక్షన్ ఆఫీస్ వద్ద పెప్‌టాక్ సమావేశంలో ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. ప్రతినెల టార్గెట్ ప్రకారం విద్యుత్ బిల్లులు వసూలు చేసి వినియోగదారులకు కావలిసిన అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని వ్యవసాయ సర్వీస్‌లకు కావల్సిన పోల్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు సామాగ్రి వెంటనే ఏర్పాటు చేసి సర్వీసులు రిలీజ్ చేయాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్‌లు, లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు నిర్వహణ వివరాలను ఆన్‌లైన్ మొబైల్ ఆప్‌లో పొందుపర్చాలని ఆదేశించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్

ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా జగిత్యాల వాసి


వెల్మల భరత్

జగిత్యాల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా జగిత్యాల జిల్లా వాసి నియమితులయ్యారు. జగిత్యాల జిల్లా మేడిపెల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన వెల్మల భరత్ పదో తరగతి వరకు గ్రామంలోనే చదివారు. ఇంటర్, డిగ్రీ జగిత్యాలలోని ప్రభుత్వ కళాశాలలో చదివారు. 2015లో న్యాయవిద్యలో పట్టా అందుకొని అదే సంవత్సరం న్యాయవాదిగా హైకోర్టులో ప్రాక్టీసు మొదలుపెట్టాడు. గతంలో హైకోర్టు న్యాయవాదుల సంఘంలో కార్యనిర్వాహక సభ్యునిగా సేవలందించిన భరత్ ప్రస్తుతం హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డికి, అడిషనల్ అడ్వకేట్ జనరల్ రజినీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా భరత్ నియామకం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరి అరెస్టు


ఇద్దరిని అరెస్టు చేసిన ఎక్సైజ్ సీఐలు

సుల్తానాబాద్, ఆగస్టు 8: నాటు సారాయితో పాటు, సారాయి తయారీ కోసం తీసుకువెలుతున్న ఇతర పదార్థాలను పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు సుల్తానాబాద్ ఎక్సైజ్ సీఐ రఘునాథ్ రాథోడ్ తెలిపారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ముందు గురువారం నిందితుల అరెస్టు చూపుతూ పదిహేను లీటర్ల సారాను, సారా తయారీ కోసం ఉపయోగించే వంద కిలోల బెల్లంను, పది కేజీల పటికను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ గురునాథ్ మాట్లాడుతూ వీణవంక మండలం నుంచి కాల్వశ్రీరాంపూర్ మండలం పందిళ్ల గ్రామానికి టాటా ఏసీ వాహనంలో గంట సారయ్య, బండి అఖిల్ అనే ఇద్దరు వ్యక్తులు వీటిని తరలిస్తుండగా తాము వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారని వివరించారు. ఈ మేరకు సుల్తానాబాద్ ఎక్సైజ్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని అన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ కె ఎస్ ఎన్ రాజు, సిబ్బంది బీర్బల్, మహేందర్, సంతోష్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


కందాల శ్రీనివాస్(ఫైల్)

ఇల్లందకుంట, ఆగస్టు 8: ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన కందాల శ్రీనివాస్ (42) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ తన నివాసంలో సంపు హౌజ్‌లోని చిన్న మోటర్‌ను మరమ్మతు చేసేందుకు పైకి లాగి మోటర్‌ను అందుకునే సమయంలో ప్రమాదవశాత్తు మోటర్‌కు షార్ట్ సర్క్యూట్ కావడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నవత, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి భార్య నవత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

పొలంలో పడి వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 8: మండలంలోని మూలసాల గ్రామానికి చెందిన నర్ర సమ్మయ్య (48) అనే రైతు ప్రమాదవశాత్తు పొలంలో పడి ఊపిరాడక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి కాలు జారి పొలంలో పడిపోవడంతో మొహం పూర్తిగా బురదలో ఉండటంతో ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 8: మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన చింతపండు ఝాన్సీరాణి (19) అనే యువతి చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత కొంతకాలంగా యువతి కడుపునొప్పితో బాధపడుతుండేది. నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటికీ వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి చింతపండు సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8: చిట్టుమల్ల శ్రీనివాస్ అనే వ్యాపారవేత్తపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ, దూషి స్తూ చంపుతానని బెదిరింపులకు పాల్పడిన కరీంనగర్ వాసవీకాలనీకి చెందిన నీరుమల్ల శ్యాంసుందర్‌పై కేసు నమోదు చేశామని కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపారు. కరీంనగర్‌కు చెందిన వ్యాపారవేత్త చిట్టుమల్ల శ్రీనివాస్‌కు పదేపదే ఫోన్ చేసి బూతులు తిడుతూ, చంపుతానని ఫోన్‌లో బెదిరించడంతో పాటు వాట్సాప్ గ్రూపులలో అసభ్య పదజాలంతో దూషిస్తూ పోస్టులు పెట్టిన నీరుమల్ల శ్యాంసుందర్‌పై బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కోర్టు అనుమతితో నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గంభీరావుపేటలో వరుస దొంగతనాలు


గంభీరావుపేట, ఆగస్టు 8: గంభీరావుపేట మండల కేంద్రంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనతో ఉన్నారు. పక్షం రోజులుగా దొంగలు వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. దీంతో ఇళ్లకు తాళాలు వేసి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. ఏ రోజు ఏ ఇంట్లో దొంగతనం జరుగుతుందో.. తెల్లారితే ఏ ఇల్లు లూటీ అవుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. తాళాలు వేసిన పలు ఇళ్లల్లో ఇటీవల దొంగలు చోరీకి పాల్పడ్డారు. విజయ అనే మహిళ ఇంట్లో తప్ప మిగితా ఇళ్లలో పెద్దగా లూటి జరగలేదు. అయితే విజయ ఇంట్లో బంగారం, వెండి అభరణాలు దొంగలు ఎత్తుకెళ్లారు. విజయ ఇంటి ముందే కేజీటూపీజీకి సంబందించిన సీసీ కెమెరాలు ఉన్నా.. సీసీ కెమెరాలు పనిచేయలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఓ కాలనీలో దొంగగా బావిస్తున్న ఓ వ్యక్తి చేతిలో ఇనుప సలాక పట్టుకుని ముసుగు ధరించి వెళుతున్న దృశ్యం అక్కడి సీసీ కెమెరాలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆ సీసీ కెమెరా ఫుటేజీ సోషల్ మీడియా వైరల్ అవుతోంది. ఈ దృశ్యం గంభీరావుపేటలోనిదా కాదా ఇంకా స్పష్టం కాలేదు. దొంగలు గంభీరావుపేటలో రాత్రి సమయాల్లో సంచరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం కూడ ఎల్లమ్మ కాలనీలో తాళం వేసి ఉన్న శివ అనే వ్యక్తి ఇంటి గోడ దూకారని పోలీస్‌లకు ప్రజలు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీస్‌లు అక్కడికి చేరుకునే సరికి దొంగలు మరో వైపు పరిగెత్తారని తెలిపారు. నిర్ధారణతో పోలీస్‌లు, ప్రజలు కొద్ది దూరం వరకు వెళ్లి వెతికినా దొంగలు దొరకలేదు. ఏదీ ఏమైనా రాత్రి అయిందంటే గంభీరావుపేటలో దొంగల భయం వెంటాడుతోంది. పోలీసు అధికారులు రాత్రి సమయాల్లో మరింత గస్తీ పెంచి, దొంగల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.

రైతులు సమష్టిగా
సొసైటీని అభివృద్ధి చేసుకోవాలి

● నాబార్డ్ డిడిఎం జయప్రకాశ్

చిగురుమామిడి,అగస్టు 8: రైతులు సమష్టిగా సొసైటీని అభివృద్ధి చేసుకోవాలని నాబార్డ్ డిడిఎం జయప్రకాశ్ అన్నారు. గురువారం మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ గాగిరెడ్డిపల్లి సొసైటీకి ఎఫ్‌పీఓలో మంచి పేరు ఉందన్నారు. రానున్న రోజుల్లో సొసైటీని మరింత అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. నాబార్డ్ నుంచి సహకారం ఉంటుందన్నారు. రైతులకు కావాల్సిన సదుపాయాలు అందిస్తామన్నారు. డాక్టర్ వేంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతులు కంపోస్ట్ ఎరువులు వాడాలని అన్నారు. వరి పొలంలో ఎర్ర బొమ్మిడి రోగానికి జింకు వాడాలన్నారు.కార్యక్రమంలో సంఘం చైర్మన్ మంద శ్రీనివాస్, శాస్త్రవేత్తలు, రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రేపు 'సుద్దముక్క' ఆవిష్కరణ



సుద్దముక్క పుస్తకం, రచయిత నలిమెల భాస్కర్

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 8: సాహితీ సోపతి ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ రచించిన సుద్దముక్క ద్వితీయ సంపుటి ఆవిష్కరణ శనివారం ఉదయం 10 గంటలకు ఫిలింభవన్‌లోజరుగనున్నట్లు సీవీ కుమార్ దామరకుంట శంకరయ్య తెలిపారు. 2008లో భాస్కర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకునిగా పని చేస్తున్న కాలంలో 34 కవితలతో ఈ పుస్తకం పురుడు పోసుకుంది. ఇందులో 'అక్షరప్రాశన' కవిత పుస్తకాన్ని సింహభాగాన నిలుపగా సుద్దముక్క, బోధివృక్షం, గది, ఒక్క ముక్క కాదు సుమా!, పవిత్ర కార్యం వంటి కవితలు ఆణిముత్యాలే! దీనికి ముందుమాట ప్రముఖ కవి జూకంటి జగన్నాథం అందించారు. నల్లబల్లను క్షేత్రంగా సుద్దముక్కను బీజంగా మలచుకొని ఉపాధ్యాయుడు విద్యార్థుల మదిలో విజ్ఞాన సస్యాలు పండించే గొప్ప అంశాలను లోకానికి భాస్కర్ చాటి చెప్పారు. అన్నవరం దేవేందర్ అధ్యక్షతన, బూర్ల వేంకటేశ్వర్లు ప్రారంభోపన్యాసం మధ్య సీనియర్ జర్నలిస్ట్ నగునూరి శేఖర్ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారని పేర్కొన్నారు. అన్నాడి గజేందర్‌రెడ్డి పుస్తకం గురించి మాట్లాడుతారని, కవి నేపథ్య వివరాలను వేముల సత్యనారాయణ వివరిస్తారని తెలిపారు. పుస్తకంలోని కవితలను నంది శ్రీనివాస్, కందుకూరి అంజయ్య, కెఎస్ అనంతాచార్య, గాజుల రవీందర్, గాజోజు నాగభూషణం, కూకట్ల తిరుపతి చదివి వినిపిస్తారని తెలిపారు.

హెచ్‌సీఏ క్రికెట్ టోర్నమెంట్‌కు అల్ఫోర్స్ విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 8: హెచ్‌సీఏ క్రికెట్ టోర్నమెంట్‌కు అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్ విద్యార్థి ఎ.అశ్వత్‌రావు ఎంపికయ్యాడు. గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి హెచ్‌సీఏ టోర్నమెంట్‌కు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఢిల్లీ పరేడ్‌కు సెయింట్‌జార్జ్ విద్యార్థి ఎంపిక

భగత్‌నగర్,ఆగస్టు8: ఢిల్లీలో జరగబోయే స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌కు సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ (సిబిఎస్ఈ) పాఠశాల విద్యార్థి వి.రోహిత్‌కుమార్ ఎంపికయ్యాడు. గురువారం పాఠశాలలో విద్యార్థిని పాఠశాల చైర్మన్ పి.ఫాతిమారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సీసీ 9టి బెటాలియన్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన ప్రీ ఆర్‌డిసి ఐజిసి-1 కల్చరల్ (గిటార్)కు ఎంపికయ్యాడన్నారు. ఎన్‌సీసీ బృందాన్ని, కేర్ టేకర్ రజితను అభినందించారు.

సీఐ కుటుంబానికి ఆర్థిక సహాయం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సీఐ రాజేష్ కుటుంబానికి తోటి సీఐలు తమ వంతుగా 16 లక్షల 80 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. 2007లో ఎస్ఐగా పోలీసుశాఖలో చేరిన సైరి రాజేష్(42) సీఐగా పదోన్నతి పొందారు. అనారోగ్యం కారణంగా ఫిబ్రవరిలో మరణించాడు. మృతుడికి భార్య రాధ, కూతురు హాసిని(11), కొడుకు కార్తికేయ(8)లున్నారు. మరణించిన సీఐ రాజేష్ బ్యాచ్‌కు చెందిన సీఐలు తోటి స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు 16.80 లక్షల రూపాయలు జమచేసి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సృజన్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, స్వామి తదితరులున్నారు.

జిల్లాలో పర్యటించిన రాష్ట్ర వైద్య బృందం

సుభాష్‌నగర్, ఆగస్టు 8: సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా వైద్య సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయం తెలుసుకునేందుకు రాష్ట్ర వైద్య బృందం జిల్లాలో పర్యటించింది. గురువారం రాష్ట్ర నిఘా విభాగం ఐడీఎస్‌పీ కార్యక్రమంలో భాగంగా ఐహెచ్‌ఐపి పోర్టల్ డాక్టర్ రాజు, రాష్ట్ర ఎపిడమియాలజిస్టు పి ముక్తా వెంకటేష్‌తో కూడిన రాష్ట్ర సర్వే బృందం జిల్లాలోని మానకొండూరు, వెల్ది, జిల్లా కేంద్రంలోని మోతాజ్‌ఖాన, బుట్టి రాజారాం కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల నివారణపై తీసుకుంటున్న చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాతతో వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో డీటీటీపీవో డాక్టర్ ఉమాశ్రీ, టి స్వామి, ఎండి ఖాలిక్, జె శివకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో మొక్కలు నాటిన వైద్యులు

హుజూరాబాద్, ఆగస్టు 8: హుజూరాబాద్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో గురువారం వైద్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. చెట్లు అహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్ఎంవో సుధాకర్‌రావు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లందకుంట, ఆగస్టు 8: వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో ఏర్పాటు చేసే హెల్త్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్ అన్నారు. గురువారం మండలంలోని పాతర్లపల్లి, సిరిసేడు గ్రామాల్లో ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సీజనల్ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ తులసీదాస్ మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణ్, సీహెచ్‌వో శ్యామల, సూపర్‌వైజర్లు బాలశౌరి, సువార్త, హెల్త్ అసిస్టెంట్ అజీజ్, ఆశావర్కర్లు సత్య, రజిత పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను అందజేసిన సీఐ

హుజూరాబాద్, ఆగస్టు 8: హుజూరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో పోగొట్టుకున్న స్మార్ట్ ఫోన్లను గురువారం ఎనమిది మంది బాధితులకు టౌన్ సీఐ తిరుమల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల చాలా మంది సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటున్నారని ఫిర్యాదులు రాగా, ఒక పోలీస్ టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. సాంకేతిక టెక్నాలజీతో పోగొట్టుకున్న 8 సెల్ ఫోన్లను పట్టుకొని బాధితులకు అప్పగించామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

శంకరపట్నం, ఆగస్టు 8: శంకరపట్నం మండలం కేశవపట్నం రైతు వేదికలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పక నెరవేస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పాటు పడతానని తెలిపారు. అనంతరం శంకరపట్నం మండలంలోని మొలంగూర్ ఇండియన్ బ్యాంకులో అర్హులైన రైతులకు రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ బత్తుల భాస్కర్, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, ఉప్పుగల్ల మల్లారెడ్డి, బండారి తిరుపతి, గట్టు తిరుపతి, నాంపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నంబర్‌ప్లేట్ లేకుంటే చర్యలు తప్పవు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 8: నంబర్‌ప్లేట్ లేని వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పట్టణ సీఐ వరంగంటి రవి అన్నారు. గురువారం జమ్మికుంటలో వాహనాల తనిఖీ చేపట్టారు. నెంబర్‌ప్లేట్ లేని, త్రిబుల్ రైడింగ్ చేసిన 60ద్విచక్ర వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి వాహనానికి నెంబర్‌ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఐ వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఢిల్లీ వెళ్లిన మాలమహానాడు నాయకులు

గంగాధర, ఆగస్టు 8: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరసన కార్యక్రమానికి నియోజకవర్గ మాల మహానాడు నాయకులు తరలివెళ్లారు. గంగాధర మండలం నుంచి పలువురు నాయకులు తరలివెల్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల మధ్య చిచ్చు పెట్టి విడగొట్టాలని ప్రభుత్వాలు చూస్తున్నాయని అన్నారు. ఢిల్లీకి తరలివెళ్లిన వారిలో తాళ్ల వెంకట్, కిషన్, దిలీప్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి


మాట్లాడుతున్న మాదిగ మేధావుల ఫోరం బాధ్యులు

సుభాష్‌నగర్, ఆగస్టు 8: సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని మాదిగ మేధావుల ఫోరం ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ నతానియోలు, బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరాస్వామి కోరారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడడం అభినందనీయమన్నారు. వెంటనే ఆర్డినెన్స్ తీసుకువచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫోరం బాధ్యులు బండ శ్రీనివాస్, అసంపల్లి నాగరాజు, మడిపెల్లి శంకర్, తాటిపెల్లి ఈశ్వర్, ఆరెపెల్లి కొమురయ్య, గాలిపెల్లి కుమారస్వామి, గసికంటి రాజయ్య నాగెల్లి దేవేందర్, హరీష్, గజ్జెల ఆనందరావు, కోండ్ర స్వరూప, గాలిపెల్లి శ్రీనివాస్, బోయినిపల్లి చంద్రయ్య, దండు మధు, బొత్త వెంకటమల్లయ్య, బెజ్జంకి కిష్టయ్య, రావికంటి వెంకటయ్య, జేరిపోతుల శంకర్, గొర్రె రాజయ్య చంద్రయ్య, హస్తాపురం భూమయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకత పెంపొందించుకోవాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 8: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యాంసాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. కళాశాలలో జిల్లా స్థాయి ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంటికో ఇన్నోవేటర్ గా మారి తమ చుట్టూ ఉన్న సమస్యలకు ఒక పరిష్కారం మార్గాన్ని కనిపెట్టడానికి ప్రయత్నం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఇన్నోవేషన్ సెల్ కోఆర్డినేటర్ మణిదీప్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇన్నోవేషన్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు ఆవిష్కరించిన ఆవిష్కరణలను విద్యార్థులకు చూపి వారిలో ఉత్తేజాన్ని పెంచారు. ఈ కార్యక్రమంలో ఇంటికో ఇన్నోవేషన్ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నితిన్, అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి నితిన్ అధ్యాపకులు టి రాజయ్య వంగల శ్రీనివాస్ పడాల తిరుపతి ఎం మల్లారెడ్డి సుధాకర్ రాజేందర్ రామకృష్ణ అరవింద్ విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ మూడో ఠాణా సీఐ జాన్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ వావిలాలపల్లిలో ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ర్యాగింగ్ నియంత్రణలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జాన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువును అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. క్రమశిక్షణ తప్పి ప్రవర్తిస్తే భవిష్యత్ అమ్యగోచరంగా తయారవుతుందన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి, వ్యయప్రయాసలకు ఓర్చి విద్యార్థులను చదివిస్తున్నారని, వారి ఆశయాలను నెరవేర్చేవిధంగా తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. ఇంటర్‌మీడియట్ చదువు విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించే కాలమని, ఈ సమయంలో విద్యార్థులు క్రమశిక్షణను అలవరచుకుంటే వారి భవిష్యత్ బాగా ఉంటుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

సుభాష్‌నగర్, ఆగస్టు 8: బదిలీపై వచ్చిన అధికారులను టీఎన్‌జీవో ఆధ్వర్యంలో సన్మానించారు. గురువారం జిల్లా సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీపై వచ్చిన ఎల్ ప్రభాకర్, కరీంనగర్ అర్బన్ తహసిల్దార్ జె నరేందర్, కరీంనగర్ రూరల్ తహసిల్దార్ సిహెచ్ రాజులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, తహసీల్దార్ మడిపల్లి కాళిచరణ్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్ సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి నేరెళ్ళ కిషన్, వెలిచాల సుమంత్‌రావు, నాయకులు మన్మిత్‌సింగ్, మోయిజ్, సత్యనారయణ, సుధాకర్‌రెడ్డి, కరుణాకర్, పట్టెం శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, రఘు, వాస్తవిక్‌గౌడ్, ప్రణీత్, కనకరాజు, డిప్యూటి తహసీల్దారులు కమురుద్దీన్, శంకర్ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కరీంనగర్ టౌన్/క్రైం/రూరల్, ఆగస్టు 8: యువత సోషల్ మీడియాకు, మత్తు పదార్థాలకు బానిస కావద్దని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ సూచించారు. గురువారం ఆయన నగరంలోని బైపాస్‌రోడ్ మహాత్మా జ్యోతిరావుపూలే గర్ల్స్ హాస్టల్, కోతిరాంపూర్ సవరాన్ ప్రభుత్వ స్కూల్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్, మహిళా సంక్షేమశాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియా ద్వారా విద్యార్థులు, యువత ఏ విధమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విషయంపై అవగాహన కల్పించారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్ చాట్, యూట్యూబ్, రీల్స్‌కి ఎక్కువగా అలవాటుపడి సమయం అంతా వృధా చేసుకుంటున్నారని అన్నారు. ప్రస్తుతం ఉన్న సాంకేతిక రంగంలో అనేక మార్పులు వస్తున్నాయని, అవి అన్నిటిపై కూడా యువతకు సరైన అవగాహన లేక మోసపోతున్నారని అన్నారు. 16 నుండి 21 సంవత్సరాల యువత ఎక్కువగా వివిధ అంశాల గురించి ఇంటర్నెట్‌లో వెతుకుతున్నారన్నారు. అలాంటి సందర్భంలో వివిధ జాబ్స్, డిస్కౌంట్‌కు సంబంధించిన వాటిని పరిశీలిస్తూ అదే సమయంలో డ్రగ్స్‌కు ఆకర్షితులై చెడు మార్గంలో వెళ్తున్నారని అన్నారు. అలా కాకుండా మంచి పుస్తకాల చదువుతూ స్కిల్స్ డెవలప్‌మెంట్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ ఠాణా సీఐ అశోక్‌కుమార్, ఎక్సైజ్ ఎస్ఐ లక్ష్మణ్, సిబ్బంది భూమయ్య, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా అంజలి


అంజలిని సన్మానించిన మున్సిపల్ పాలక వర్గ సభ్యులు

భగత్‌నగర్, ఆగస్టు 8: కొత్తపల్లి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్‌గా జేరిపోతుల అంజలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలో సభ్యులు మద్దతు ప్రకటించడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్‌డీఓ మహేశ్వర్ ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. కొత్తపల్లి వైస్ చైర్‌పర్సన్‌గా కొనసాగిన రెండవ వార్డు సభ్యురాలు బండ రాధ మరణించడంతో ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కొత్తపల్లి మున్సిపాలిటీలో 12మంది కౌన్సిలర్లకు గాను 2వ వార్డు సభ్యురాలు మరణించడంతో 11 మంది సభ్యులు ఉన్నారు. గురువారం నిర్వహించిన వైస్ చైర్మన్ ఎన్నిక కోసం ఏడుగురు సభ్యులు హాజరు కాగా కోరడం ఉండడంతో ఎన్నికను నిర్వహించారు. జేరిపోతుల అంజలిని వైస్ చైర్ పర్సన్‌గా మున్సిపల్ రుద్ర రాజు రాజు ప్రతిపాదించగా 10 వార్డు కౌన్సిలర్ గండురాంబాబు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా తన ఎంపికకు కృషిచేసిన కరీంనగర్ శాసనసభ్యుడు గంగుల కమలాకర్‌కు, మాజీ జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండి జమీలుద్దీన్‌లకు వైస్ చైర్‌పర్సన్ జేరిపోతుల అంజలి కృతజ్ఞతలు తెలిపారు.

'క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమించాలి'

భగత్‌నగర్, ఆగస్టు 8: ప్రజా వ్యతిరేక విధానాలపై క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమించాల్సిన అవసరం ఉందని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలన్నారు.

శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 14న జరిగే జన జాగరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్ టియు, టిఎన్‌టియుసి, రైతు సంఘం, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా ముఖ్య నాయకులు హాజరయ్యారు. బోయిని అశోక్, ఎడ్ల రమేష్, మిల్కూరి వాసుదేవరెడ్డి, జిందం ప్రసాద్, కల్యాణపు ఆగయ్య, వడ్ల రాజు, ఉప్పునూటి శ్రీనివాస్, గుడికందుల సత్యం, సుంకరి సంపత్, రాయికంటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి


మహాత్మానగర్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, ఆగస్టు8: గ్రామాల్లో ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరు నాలుగు మొక్కలు చొప్పున నాటాలని అందుకు మొక్కలు కూడా ప్రభుత్వమే ఉచితంగా పంపిణి చేయడం జరుగుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పెర్కొన్నారు. గురువారం మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంట్లో ఉండే తడి పొడి చెత్తను వేరువేరుగా చేసి బయట వేయకుండా గ్రామపంచాయతీ సిబ్బందికి అందించా లని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డిపివో రవీందర్, ఇతర అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోరపల్లి రమణా రెడ్డి, నాయకులు తిరుపతి రెడ్డి, పొలు రాము, సమద్, కమలాకర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

● మానకొండూర్ : పేదల సంక్షేమమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరువతీసుకోవడంతోనే ఈ పథకం రాష్ట్రంలో కొనసాగుతుందన్నారు. లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులో తప్పులు దొర్లినా సవరించి పంపిణీ చేయడం జరిగిందన్నారు. క్యాంపు కార్యాలయానికి నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రత్యేక అధికారి శ్రీధర్, తహశీల్దార్ రాజేశ్వరీ, ఎంపీడివో వరలక్ష్మీ, నాయకులు రవీంద్రాచారి ఉన్నారు.

జీపీ కార్మికుల సమ్మె

శంకరపట్నం, ఆగస్టు 8: శంకరపట్నం మండలం ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు ఒక్కరోజు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు జీపీ కార్మికులు వారి సమస్యను వివరించారు. ఎమ్మెల్యే వారితో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

● ఇల్లందకుంట: గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఇచ్చిన పిలుపు మేరకు కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. వెంటనే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాల ద్వారానే రైతు సమస్యల పరిష్కారం


జమ్మికుంట, ఆగస్టు 8: ఐక్య ఉద్యమాలు, పోరాటాల ద్వారానే రైతు సమస్యలు పరిష్కారం అవుతాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె)లో విత్తన రైతుల సంఘం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తే రైతంగానికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా నాయకులు శీలం ఆశోక్, గుండేటి వాసుదేవ్, కాగిత లింగారెడ్డి, బి రాజు, ఆశోక్‌రెడ్డి, రాజిరెడ్డి, యుగేందర్, మల్లయ్య పాల్గొన్నారు.

● విత్తనోత్పత్తి రైతుల సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కన్వీనర్‌గా వర్ల వెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులు చల్లారపు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రావు, సంపత్‌రావు, రాము, చంద్రమౌళి, రమాదేవి, రమేష్‌లు ఎన్నికయ్యారు.

అంబేద్కర్ సంఘం కార్యవర్గం ఎన్నిక

గన్నేరువరం, ఆగస్టు 8: అంబేద్కర్ సంఘం గన్నేరువరం గ్రామశాఖ నూతన కార్యవర్గాన్ని గురువారం సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కవ్వంపల్లి మునీందర్, ప్రధాన కార్యదర్శిగా న్యాత రమేష్, ఉపాధ్యక్షులుగా న్యాత అనిల్, కాడె హనుమంతులు నియామకమయ్యారు. వీరిని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు విజయేందర్, మాతంగి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి


హుజూరాబాద్‌లో కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

హుజూరాబాద్ లీగల్, ఆగస్టు 8: జనగామ పట్టణంలో న్యాయవాద దంపతులపై దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం హుజూరాబాద్ కోర్టు ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాద దంపతులపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. దాడిని వ్యతిరేకిస్తూ గురు, శుక్రవారాలు న్యాయవాదులు తమ కోర్టు విధులను బహిష్కరించినట్లు వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మట్టెల తిరుపతి, సీనియర్ న్యాయవాదులు వీరసేనారెడ్డి, సత్యనారాయణరెడ్డి, ముక్కెర రాజు, నల్ల భూమిరెడ్డి, బండి కళాధర్, పులుగు లింగారెడ్డి, బండి రమేష్, నక్క సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, ముషం మౌనిక, విక్రమ్, రవితేజ, ప్రవీణ్, కుమారస్వామి, మాధవి, సరిత, దివ్య, లింగమూర్తి, దేవయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయాలపై సెమినార్‌కు 'ముదుగంటి'కి ఆహ్వానం



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు8: హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్ రాష్ట్ర గ్రంథాలయంలో ఈనెల 11న పౌరగ్రంథాలయాలపై జరిగే సెమినార్‌కు జిల్లాకు చెందిన తెలంగాణ గ్రంథాలయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, విశ్రాంత గ్రంథాలయాధికారి డాక్టర్ ముదుగంటి సుధాకరరెడ్డికి గురువారం రాష్ట్ర ప్రభుత్వ పౌర గ్రంథాలయ పరిషత్ సంచాలకుడు డాక్టర్ రియాజ్ నుంచి ఆహ్వానం అందింది. సుధాకరరెడ్డి పౌర గ్రంథాలయాల ఆధునీకరణ-అభివృద్ధి అంశంపై ప్రసంగించనున్నారు.

సీఐ రాంరెడ్డిని సర్వీస్ నుంచి తొలగించాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 8: దళిత మహిళ సునీతపై విచక్షణారహితంగా దాడి చేసిన సీఐ రాంరెడ్డిని సర్వీసు నుంచి తొలగించాలని బహుజన సామాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దొడ్డె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో దళితులపై జరుగుతున్న దాడులకు కాంగ్రెస్ ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలన్నారు. సీఐ రామ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంచార్జీలు నల్లాల శ్రీనివాస్, మంద మల్లయ్య, కల్లెపల్లి రాజేందర్, అక్కి బాలకిషన్, మాకాంలి తిరుపతి, కుమ్మరి సంపత్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారుల హామీ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 8: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ఇవ్వాల్సిన ఏరియర్స్, యూనిఫామ్ దుస్తులు, రేయిన్ కోట్లు, షూ ఇవ్వడంతోపాటు ఇతర సమస్యలన్నిటిని ఈనెల 15లోగా పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చినట్లు బీఆర్‌టియు కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ నాయకులు జనగాం రాజమల్లు, బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం వారు మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, సూపరింటెండెంట్ సునీల్, శ్రీనివాస్‌తో కార్మికుల సమస్యలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్ళగా వారు సానుకూలంగా స్పందించి ఆగస్టు 15 వరకు వాటన్నిటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఒకవేళ హామీని నిలబెట్టుకోని పక్షంలో ఈనెల 16 నుంచి సమ్మెకు వెళ్తామని కార్మిక సంఘ నాయకుడు జనగాం రాజమల్లు ప్రకటించారు.

'బల్దియా షెట్టర్ల కేటాయింపులో అధికారుల చేతివాటం'

కరీంనగర్ టౌన్, ఆగస్టు 8: నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో మార్కెట్ షెట్టర్ల కేటాయింపులో మున్సిపల్ రెవెన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూ బల్దియా ఆదాయానికి గండి కొడుతున్నారని ముద్దం నవీన్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈమేరకు ఆయన షెట్టర్ల కేటాయింపులో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకొని అర్హులకు షెట్టర్లను ఇప్పించాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, నగర మేయర్, సుడా చైర్మన్లకు వినతిపత్రం సమర్పించారు.

ధరణి కమిటీ చైర్మన్‌ను కలిసిన వేణుగోపాల్

సుభాష్‌నగర్, ఆగస్టు 8: ధరణి చైర్మన్ కోదండరెడ్డిని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ కలిశారు. ఈ సందర్భంగా త్వరలో రానున్న 2024 ఆర్‌వోఆర్ చట్టం, భూమాత వంటి అంశాలపై పలు సూచనలు చేశారు.

నేడు నాగ పంచమి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 8: శ్రావణ మాసంలో వచ్చే నాగుల పంచమి, గరుడ పంచమిని శుక్రవారం జరుపుకోనున్నారు. పుట్టలున్న శైవ, వైష్ణవాలయాల్లో భక్తులు పాల్గొని పాలు పోయనుండగా వైష్ణవాలయాల్లో గరుత్మంతున్ని ఆరాధించ నున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉపవాసాలు పాటించి పుట్ట మట్టిని బంగారంగా భావించి తిలకధారణ చేసుకుంటారు.

డీపీవోకు వినతి

రామడుగు, ఆగస్టు 8 : రామడుగు గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలని కోరుతూ డీపీవోకు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీపీ జట్టుపల్లి వీరయ్య, కలిగేటి ఎల్లయ్య, నాగి శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన వైద్య బృందం

మానకొండూర్, ఆగస్టు 8 : మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వేలెన్స్ ప్రోగ్రామ్ బృంద సభ్యులు సందర్శించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి స్వామి, పిహెచ్‌సీ వైద్యులు సౌమ్య, సిహెచ్‌వో రాజ్‌నాయక్, వైద్య సిబ్బంది ఉన్నారు.

బీమా చెక్కు అందజేత

హుజూరాబాద్, ఆగస్టు 8: హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో 102 అమ్మ ఒడి వాహనం డ్రైవర్‌గా పనిచేసిన వెంకటేష్ ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబానికి గురువారం హెచ్ఆర్ కిరణ్‌కిశోర్ రూ. 5లక్షల బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్, 108,102 సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం

హుజూరాబాద్, ఆగస్టు 8: హుజూరాబాద్ పట్టణానికి చెందిన తిప్పారపు సంపత్‌ను టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్‌గా నియమిస్తూ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పాఠశాలలను సందర్శించిన నాయకులు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 08: జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను బీఆర్ఎస్వీ నాయకులు గురువారం సందర్శించారు. విద్యార్థుల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పట్టణ అధ్యక్షులు కొమ్ము నరేష్, అప్పని హరీష్‌వర్మ, చింతల కౌశిక్, పనికారి రమేష్, రాపర్తి అరవింద్, ఒలాల శ్రీకాంత్ ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గంగాధర, ఆగస్టు 8: గర్షకుర్తిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. క్విట్ ఇండియా మూవ్‌మెంట్ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శ్రీనివాస్,అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

రామడుగు, ఆగస్టు 8 : మండల కేంద్రంలో వడ్డెర సంఘం యూత్ ఎన్నికలు గురువారం జరిగాయి. యూత్ అధ్యక్షుడిగా మడిగే మల్లేష్, ఉపాధ్యక్షుడిగా ఓర్సు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శులుగా శివరాత్రి మహిపాల్, బత్తిని రవి, కోశాధికారిగా బోదాసు రాజేష్ ఎన్నికయ్యారు.

కొవ్వొత్తులతో నిరసన

రామడుగు, ఆగస్టు 8 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా గురువారం రాత్రి గోపాల్‌రావుపేటలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.